క్లుప్తంగా

నర్సరీ తనిఖీ



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి తనిఖీ చేశారు. కొంగోడ్, అంసాన్‌పల్లి, నాయిని జలాల్పూర్ గ్రామాల్లోని నర్సరీలను, ఆయా పంచాయతీ కార్యాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమైన మొక్కలను పూర్తిస్థాయిలో పెంచాలని, వచ్చే వేసవికాలంలో మొక్కల రక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. అలాగే వసురాం తండాలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మంజుల, శ్రీనివాస్, కిష్టయ్య, మోతీ, కొల్చారం వైద్యాధికారి రమేశ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నర్సరీలను సిద్ధం చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): వచ్చే సీజన్ లోపు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఏపీఓ ఆదినారాయణ సూచించారు. శుక్రవారం మండలంలోని కాళ్ళకల్ గ్రామంలో సర్పంచ్ మల్లేశ్‌తో కలిసి ఆయన నర్సరీని సందర్శించారు. గ్రామానికి అవసరమైన మొక్కలను పెంచాలని సిబ్బందికి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేశామని తెలిపారు. వీరి వెంట ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

కొత్తపేటలో ట్రిపుల్‌ఆర్ సర్వే



సర్వే చేస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూ సర్వే చేశారు. సర్వేయర్ యాదగిరి ఆధ్వర్యంలో సిబ్బంది కొత్తపేట గ్రామ శివారులో నుంచి ఏర్పాటు కానున్న ట్రిపుల్‌ఆర్‌కు సంబంధించిన భూములను సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్వేయర్ మాట్లాడుతూ.. కొత్తపేట పంచాయతీ పరిధిలో 45 ఎకరాలు సేకరిస్తామని, భూ నిర్వాసితులకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం పరిహారం ఇస్తామని చెప్పారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

నర్సాపూర్‌రూరల్: నేడు మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మండల లీగల్ సెల్ సర్వీసెస్ చైర్మన్, న్యాయమూర్తి అనిత హాజరు కానున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించనున్నారు.


విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం



ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దంపతులకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో నిర్మించిన బగలాముఖీ అమ్మవారి శక్తిపీఠం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కావాలని ట్రస్ట్ సభ్యులు శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులను ఆహ్వానించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బగలాముఖీ ఉపసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్ తదితరులు ఉన్నారు.

మహిళల రక్షణకు షీ టీమ్



మాట్లాడుతున్న ఎస్‌ఐ సుభాష్‌గౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): మహిళల రక్షణ కోసమే షీ టీమ్ పనిచేస్తుందని, మహిళలకు ఏ సమస్య ఎదురైన వెంటనే షీ టీమ్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చందంపేట గ్రామంలోని ఎంఎసెన్ పరిశ్రమలో మహిళా కార్మికులకు, సిబ్బందికి పనివేళల్లో ఎలాంటి వేధింపులు ఎదురైన నేరుగా 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. షీ టీం ద్వారా సమస్యను రహస్యంగా పరిష్కరించి, మహిళలకు రక్షణ కల్పిస్తామన్నారు. అలాగే సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్‌ఐ లక్ష్మి, భరోసా సెంటర్ అధికారి అనూష పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఏర్పాటు ఎప్పుడు?

- తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో నాలుగేళ్లుగా లేని పాలకవర్గం
- మార్చిలో నిర్వహించనున్న జాతర
- ఆశావహులకు తప్పని ఎదురు చూపులు



తునికి నల్లపోచమ్మదేవి ఆలయం

కౌడిపల్లి(నర్సాపూర్): వందల ఏళ్ల చరిత్ర కల్గిన ఆలయం.. లక్షల్లో దేవాదాయ శాఖకు ఆదాయం. అయినా నాలుగేళ్లుగా ఆలయ కమిటీ ఏర్పాటు చేయడం లేదు. ప్రతీ ఏడాది క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తే, ఇప్పటికీ మరో నలుగురికి ఆలయ కమిటీ చైర్మన్ పదవి వచ్చేదని ప్రజలు అంటున్నారు. కాగా ప్రభుత్వం ఇటీవల జిల్లాలో 9 ఆలయాలకు ఆలయ ధర్మకర్తల కమిటీకి నోటిఫికేషన్ జారీ చేసింది. కానీ అందులో మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం మాత్రం లేదు. మార్చి నెలలో ఉత్సవాలు జరగనుండగా అప్పటివరకు కొత్త కమిటీ ఏర్పాటు అవుతుందా.. అని ఎదురు గ్రామస్తులు చూస్తున్నారు.

- మండల పరిధిలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం వందల ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. ఇక్కడ ప్రతీ ఏడాది హోళి పండగ తర్వాత నాలుగు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు.
- నల్లపోచమ్మ దేవి భక్తుల కోరికలు తీర్చే దైవంగా ప్రసిద్ధి చెందింది.
- జాతర సందర్భంగా గతంలో వందల సంఖ్యలో బండ్లను ఊరేగించారు.

2016లో దేవాదాయశాఖలో విలీనం

- తనికి నల్లపోచమ్మదేవి ఆలయం 2016లో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకొచ్చారు.
- ఆలయంతో పాటు ఆలయానికి నాలుగు దుకాణాలు, 10 సత్రాలు, మినీఫంక్షన్ హాల్ ఉన్నాయి. ఈఓ జూనియర్ అసిస్టెంట్‌తో పాటు 12 మంది పనులు చేస్తున్నారు.
- ఆలయానికి ప్రతీ ఏడాది దుకాణాలు, కొబ్బరి కాయలు, పార్కింగ్ వేలంతో పాటు హూండీ ద్వారా సుమారుగా రూ. 50 నుంచి 60 లక్షల ఆదాయం వస్తుంది.
- దేవాదాయశాఖలో విలీనం తర్వాత మొదటిసారిగా 2017 - 18లో ప్రభుత్వం ఆలయ కమిటీని ఏర్పాటు చేసింది. చైర్మన్‌గా తునికి గ్రామానికి చెందిన చెల్ల మల్లేశం, ధర్మకర్తలుగా నారాయణరెడ్డి, రమేశ్‌గుప్తా, లింగంగౌడ్, సంజీవ్, ఉమనరహరి, కృష్ణాగౌడ్, అర్చకుడు శివ్వప్పను ఎంపిక చేయగా, ఏడాదిలో పదవీకాలం పూర్తి అయింది.
- 2019 నుంచి 22 వరకు నాలుగేళ్లగా ప్రభుత్వం ఆలయ కమిటీని ఏర్పాటు చేయలేదు.
- రెండేళ్ల క్రితం కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రచారం జరిగినా.. కరోనా కారణంగా ఆగిపోయింది. కమిటీ ఏర్పాటు కాకపోగా ఇప్పుడు సైతం ఏర్పాటుకు నోచుకోవడంలేదు.
- చైర్మన్ పదవి కోసం తునికి గ్రామస్తులతో పాటు మండలంలో పలువురు ఆశావహులు ఎదురు చూస్తున్నారు.
- గతంలో ఆలయ ఉత్సవాలకు గ్రామ సర్పంచ్ చైర్మన్‌గా కొనసాగేవారు. దేవాదాయశాఖలో ఆలయం చేర్చిన తర్వాత ఒక్కసారి మాత్రమే కమిటీ ఏర్పాటు అయింది.



- ఆలయానికి ఆదాయం ఉన్నా.. ఆలయ కమిటీని ఎందుకు ఏర్పాటు చేయడంలేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

అధికారులకు తెలియజేశాం



తునికి నల్లపోచమ్మదేవి ఆలయ కమిటీని ఏర్పాటు చేయడానికి అధికారులకు తెలియజేశాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకొని కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నాం.

– మోహన్‌రెడ్డి, ఆలయ ఈఓ, తునికి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు

నర్సాపూర్: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశికాంత్ అన్నారు. శుక్రవారం ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నర్సాపూర్‌లోని ప్రధాన చౌరస్తా వద్ద పలు కాలేజీల విద్యార్థులతో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేశారు. దీంతో ఆయా మార్గాల్లో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పలు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో భోజనం అధ్వాన్నంగా ఉంటుందని, ఉన్నతాధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి రాహుల్, ఇతర ప్రతినిధులు అక్షయ్‌గౌడ్, సుజిత్‌రెడ్డి, కార్తీక్, రంజిత్, గణేశ్‌గౌడ్, వేణు తదితరులు పాల్గొన్నారు. కాగా ఎస్‌ఐ గంగరాజు తన సిబ్బందితో వచ్చి రాస్తారోకో విరమింపచేశారు.

నోట్ బుక్కులు అందజేత

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట బాలుర ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విశ్రాంత ఉద్యోగి సత్యనారాయణ విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయులు, నాయకులు నాగులు, సూరజ్‌సింగ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న సత్యనారాయణ

పరీక్షాపే చర్చ.. వీక్షించిన విద్యార్థులు



చేగుంట(తూప్రాన్): పరీక్షపే చర్చ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు



మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మోడల్ పాఠశాల విద్యార్థులు ప్రధానిమోదీ నిర్వహించిన పరీక్షపే చర్చ కార్యక్రమాన్ని వీక్షించారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో ప్రధాని సూచించిన సూచనలను విద్యార్థులు తెలుసుకున్నారని ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గౌస్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో పరీక్షా పై చర్చ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సాయిబాబా, మండల అధ్యక్షుడు నరేందర్‌చారి ఆధ్వర్యంలో పరీక్ష పే చర్చ కార్యక్రమంలో అడిగిన ప్రశ్నలకు ఉత్తమ సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నరేష్‌గౌడ్, ఓబీసీ అధ్యక్షుడు హరిబాబుగౌడ్ తదితరులు ఉన్నారు.

గడ్డివాము దగ్ధం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్ళకల్ గ్రామానికి చెందిన ఇమ్రాన్ సోదరులకు చెందిన గడ్డి వాము ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ళకల్ గ్రామ శివారులో జాతీయ రహదారి దగ్గరలో పెట్రోల్ బంక్ పక్కన ఉన్న ఇమ్రాన్ సోదరులకు చెందిన పొలంలో గడ్డి వామును పెట్టారు. కాగా శుక్రవారం అగ్ని ప్రమాదం కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టు పక్కల వాళ్లు గమనించి, మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కాగా అప్పటికే రూ. లక్ష విలువైన గడ్డి తగలబడినట్లు తెలిపారు. కాగా పక్కనే హెచ్‌పీ పెట్రోల్‌బంక్ ఉండటంతో స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారమివ్వగా, నర్సాపూర్‌కు చెందిన ఫైర్ ఇంజన్ సంఘటన స్థలానికి వచ్చింది. అప్పటికే వాము దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



మంటలు ఆర్పుతున్న స్థానికులు

ముగిసిన మల్లన్న జాతర

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని భస్వాపూర్ గ్రామంలో భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన మల్లన్న జాతరలో భాగంగా చివరిరోజు రథాన్ని ఊరేగించారు. వేడుకల్లో భస్వాపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో ఆలయ అర్చకుడు భస్వప్ప, కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.



రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు



బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న సునీతారెడ్డి

పరామర్శ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన మర్రి జనార్దన్‌రెడ్డి (85) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ కీర్తనహన్మంత్‌రావు, తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నర్సింహారెడ్డి

తూప్రాన్: మండలంలోని యావపూర్‌లో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ శేరి నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గడా' ప్రత్యేక నిధుల ద్వారా గ్రామానికి రూ.5లక్షల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామని చెప్పారు. గ్రామంలో అన్ని కాలనీల్లో త్వరలోనే విడతల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చిన్న మల్లారెడ్డి, కుమ్మరి నర్సింలు, సురేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి



నియామకపత్రం అందిస్తున్న నాయకులు

నిజాంపేట(మెదక్): మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మిని నియమించామని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తర్వులు జారీ చేశామని ఆయన పేర్కొన్నారు.

జాతీయ క్రీడాకారుడికి సన్మానం

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామానికి చెందిన రాహుల్ గౌడ్ జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడల్లో పాల్గొనగా కలెక్టర్ కార్యాలయంలో ప్రతిభా పురస్కారం అందుకున్నాడు. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభను కనబర్చినందుకు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎస్పీ రోహిణీప్రియదర్శిని చేతుల మీదుగా అందించినట్లు ఉప సర్పంచ్ గిరిగౌడ్ తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎంఈఓ బుచ్చానాయక్



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ బుచ్చానాయక్

కౌడిపల్లి(నర్సాపూర్): మన ఊరు – మనబడి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ బుచ్చానాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావ్‌పేట, సలాబత్‌పూర్, మహ్మద్‌నగర్, కంచన్‌పల్లి, కొట్టాల, వెల్మకన్న ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. దీంతో పాటు మన ఊరు – మనబడి పనులతో పాటు రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించారు. పాఠశాలలో పనులు వేగవంతం చేయాలని సర్పంచ్, ఎస్‌ఎంసీ చైర్మన్లతో మాట్లాడారు. పనులు త్వరగా పూర్తయితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. సమయ పాలన పాటించాలన్నారు. బోధనోపకరణలో విద్యాబోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలలో హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న సర్పంచ్ సుజాత

కొల్చారం(నర్సాపూర్): గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని మండల పరిధిలోని సర్పంచ్ సుజాత కోరారు. శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రియాంక మాట్లాడుతూ.. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై నివేదికను చదివి వినిపించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలని, గ్రామంలో త్వరలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ గ్రామసభలో ఉప సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు సురేష్, దుర్గేష్, శంకరయ్య, కారోబార్ దశరథ్, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చెప్పారు. ఆమె శుక్రవారం నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు నర్సాపూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా చాలా మంది పేదలకు ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, షేక్ హుస్సేన్, నర్సింలు తదితరులు ఉన్నారు.

'తహసీల్‌లోనే కులం సర్టిఫికెట్లు ఇవ్వాలి'



వినతిపత్రం అందిస్తున్న యాదగిరి

నర్సాపూర్: హోళియా దాసరి కులస్తులకు ఆర్డీఓల నుంచి కాకుండా మండల తహసీల్దార్ల నుంచి కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు అందజేయాలని హోళియా దాసరి సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నర్సాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ జేసిబాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీఓల ద్వారా ఇవ్వడంతో సమయం వృథా అవుతుందని, అలాగే దూరభారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను గుర్తించి, తమ కులస్తులకు మండల తహసీల్దార్ల ద్వారా కులం సర్టిఫికెట్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తుపాకులపల్లి యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ గ్రామ పంచాయతీ పరిధిలోని తుపాకులపల్లి నూతన యాదవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు. శుక్రవారం గ్రామంలో నూతనంగా ఎన్నికైన యాదవ సంఘానికి జిల్లా సంక్షేమ అసిస్టెంట్ అధికారి పండిత్ నియామకపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడిగా గాయంతి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా కొమురవెల్లి, నిమ్మల మల్లేశం, కోశాధికారిగా గాయంతి శ్రీశైలం, కార్యదర్శులుగా గాయంతి మల్లేశ్, రవీందర్, సంయుక్త కార్యదర్శులుగా నిమ్మల పుష్పమ్మ, గండీ బాలమణి, గాయంతి ఆంజనేయులు తదితరులు ఎన్నికయ్యారు.



నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

జింకకు ప్రథమ చికిత్స

రేగోడ్(మెదక్): ఎక్కడి నుంచి వచ్చిందో ఏమోగానీ జింక అస్వస్థతతో కొట్టుమిట్టాడిన సంఘటన మెదక్ జిల్లా రేగోడ్ మండల పరిధిలోని టి.లింగంపల్లి గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ప్యారారం గ్రామానికి చెందిన పాల్ తన చేనుకు వెళ్తుండగా దారిలో అస్వస్థతతో ఇబ్బందిగా పడి ఉన్న జింకను చూశాడు. దీంతో ఆయన రేగోడ్‌లోని వెటర్నరీ అసిస్టెంట్ ధర్మచందర్, పోలీసులకు సమాచారాన్ని అందించాడు. అస్వస్థతతో ఉన్న జింకని నవీన్, భరత్, పోచారం సర్పంచ్ సునీల్ ఇంటికి తరలించారు. అనంతరం వెటర్నరీ అసిస్టెంట్ ధర్మచందర్ మూగజీవికి ప్రథమ చికిత్స అందించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. పంట చేళల్లో పంట రక్షణకు ఏర్పాటు చేసిన కరెంట్ తీగలకు తగిలి జింక షాక్‌కు గురై ఉంటుందనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అస్వస్థకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న జింకను చేరదీసి, చికిత్స అందేలా కృషి చేసిన రైతు పాల్‌కి టి.లింగంపల్లి, పోచారం గ్రామస్తులు అభినందించారు.



జింకకు చికిత్స అందిస్తున్న దృశ్యం

'కంటి వెలుగు' ప్రారంభం



రామాయంపేట(మెదక్): కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్



మనోహరాబాద్(తూప్రాన్): శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణ మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ సుందర్‌సింగ్, క్యాంప్ ఇన్‌చార్జ్ డాక్టర్ లావణ్య, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కొండాపూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అరుణశ్రీ కొండాపూర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తితో కలిసి సందర్శించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో మూడు రోజుల్లో 383 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. అందులో భాగంగా 48 మందికి రీడింగ్ అద్దాలు, 27 మందికి దూరపు చూపు అద్దాలకు ఆర్డర్ చేశామని, చికిత్స కోసం 30 మందిని గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, బీఆర్‌ఎస్ నాయకులు గొల్లపల్లి సత్యనారాయణ, భాస్కర్, కంటి వైద్యులు, కార్యదర్శి శ్రీధర్, ఎఎన్‌ఎంలు, ఆశలు ఉన్నారు.